తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
8 మార్చి 2026



# విపత్తుల సమయంలో యువత ముందుండాలి

- ఆపద మిత్రులుగా యువతను తీర్చిదిద్దుతున్నాం
- సంక్షోభంలో సేవే దేశ బలం
- ఓయూలో యువ ఆపద మిత్ర శిక్షణ ప్రారంభం
- ఆత్మవిశ్వాసం, శాంతి, కరుణ మూడు కీలక విలువలు
- వికసిత భారత్‌కు విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం



సికింద్రాబాద్, మార్చి 07 (జనంసాక్షి): విపత్తుల సమయంలో యువత ముందుండి సహాయ సహకారాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. సంక్షోభ సమయంలో సేవ చేసేందుకు యువత సిద్ధంగా ఉండటం ఒక దేశానికి నిజమైన బలమని, జాతీయ సేవా పథకం వాలంటీర్లను 'ఆపద మిత్రులుగా' తీర్చిదిద్దడం ద్వారా ప్రాణాలను రక్షించగల శక్తి, విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే బలమైన వ్యవస్థను గ్రామస్థాయి వరకు నిర్మిస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగోర్ ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వ యువ ఆపద మిత్ర పథకం కింద రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్ సంస్థ రాష్ట్ర రెవెన్యూ విభాగంతో కలిసి నిర్వహిస్తున్న యువ ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఆపద మిత్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ యువతను సమాజ సేవకు సిద్ధం చేస్తున్నందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర గురించి మాట్లాడుతూ విద్యార్థుల కళ్లలో కనిపించే ఉత్సాహం, వారి హృదయాల్లో ఉన్న ఆశ దేశానికి నిజమైన బలమన్నారు. వికసిత భారత్ సాధించాలంటే వికసిత పౌరులు అవసరమని, అందుకు విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం అత్యంత ముఖ్యమన్నారు.

స్వచ్ఛంద సేవాభావం గురించి ప్రస్తావిస్తూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమాన్ని ఉదాహరణగా చూపించారు. ఈ ఉద్యమంలోని యువ సభ్యులు ఎలాంటి పారితోషికం లేకుండా తమ యూనిఫాం ధరించి సమాజానికి సేవ చేయడంలో గర్వంగా భావిస్తారని పేర్కొన్నారు. అదే నిజమైన నిస్వార్థ సేవా భావమని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ మాటలను ఉదహరిస్తూ "తమనుతాము తెలుసుకోవడానికి ఉత్తమ మార్గం ఇతరుల సేవలో మనల్ని మనం అర్పించుకోవడం" అని విద్యార్థులకు గుర్తుచేశారు. సంక్షోభ సమయంలో సేవ చేయడానికి ముందుకు వచ్చే సందర్భాల్లో ఈ సిద్ధాంతాన్ని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని తన ఉస్మానియా విశ్వవిద్యాలయ చాన్సలర్‌గా చివరి విద్యాసంబంధిత కార్యక్రమంగా పేర్కొంటూ విశ్వవిద్యాలయానికి ఉన్న గొప్ప చరిత్ర, విద్యార్థి కార్యకలాపాలను ప్రశంసించారు. దేశ అభివృద్ధి, బాధ్యతగల పౌరుల నిర్మాణానికి దోహదపడే విద్యార్థి ఆధారిత కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన రెవెన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు నిర్వహణ వ్యవస్థలో యువ వాలంటీర్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. విపత్తుల సమయంలో ప్రభుత్వ వ్యవస్థలు, స్థానిక సమాజాల మధ్య అనుసంధానంగా విద్యార్థి వాలంటీర్లు పనిచేస్తారని, వారి సిద్ధత, క్రమశిక్షణే క్షేత్ర స్థాయిలో జరిగే సహాయక చర్యల విజయాన్ని నిర్ణయిస్తుందన్నారు.

తెలంగాణ సముద్రతీర ప్రాంతం కానప్పటికీ ఇటీవలి కాలంలో భారీ వర్షాలు, మేఘ విస్ఫోటాలు, నగర వరదలు వంటి సంఘటనలు వాతావరణ మార్పులు, వేగవంతమైన పట్టణీకరణ వల్ల ఎదురవుతున్న సవాళ్లను గుర్తుచేశారు. కామారెడ్డి వంటి ప్రాంతాల్లో నీటిమునిగిన పరిస్థితులను ఉదాహరణగా చూపుతూ ఇలాంటి అనూహ్య విపత్తులకు స్పందించగల శిక్షణ పొందిన వాలంటీర్ల అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "100 రోజుల కార్యాచరణ ప్రణాళిక"లో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ విద్యాకార్యక్రమాలు, విద్యార్థి కార్యకలాపాలకు గవర్నర్ ఎల్లప్పుడూ అందిస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, అర్బన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనగేశ్, ప్రొఫెసర్ చలమల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## పరిసరాలు పరిశుభ్రత
# ఆరోగ్యానికి మేలు

### మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి

**మొయినాబాద్. మార్చి 07 (జనంసాక్షి):** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి ఎంతో మేలు అని మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు చింతకింది ప్రవీణ్ రెడ్డి అన్నారు ప్రజా పాలన ప్రగతికి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారము మండల పరిధిలోని పెద్దమారుపల్లి గ్రామంలో పరిసర పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు అనంతరం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత పై ర్యాలీ ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ కలిసి నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రవీణ్ రెడ్డి పాల్గొని ర్యాలీలో పాల్గొన్నారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజులపాటు ప్రజలకున్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రతిరోజు అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామాలలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కరిస్తారని తెలిపారు అందుకోసం ప్రజలందరూ అధికారులకు ప్రజాప్రతిలకు సహకరించి తమకున్న సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు 100%
# ఎఫ్ఆర్ఎస్‌తో నమోదు చేయాలి

- ఎఫ్ఎల్ఎన్ అంత్య పరీక్షలు మార్చి 9 నుంచి 11 వరకు
- ఎఫ్ఎల్ఎస్, ఎఫ్ఎల్ఎన్ రిజిస్టర్ల పరిశీలన
- మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి

**పూడూర్, మార్చి 07 (జనంసాక్షి):** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండలంలో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును కచ్చితంగా 100 శాతం నమోదు చేయాలని మండల విద్యాధికారి శ్రీ ఎం. అంజయ్య సూచించారు. అదేవిధంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అంత్య పరీక్షలను ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించాలని ఆదేశించారు. శనివారం మండలంలోని ప్రాథమిక పాఠశాల మిట్టకోడూరును సందర్శించిన మండల విద్యాధికారి ఎఫ్ఎల్ఎస్, ఎఫ్ఎల్ఎన్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. మండల విద్యాధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఈ పాఠశాలకు విచ్చేసినందుకు ప్రధానోపాధ్యాయులు ఎండి. ఉస్మాన్ అలీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మాణిక్యం, ఉప సర్పంచ్ మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయ బృందం కలిసి మండల విద్యాధికారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, ఎన్. నరసింహులు, రాజు, ఎంఆర్సి మెసెంజర్ శ్రీశైలం, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు జనార్ధన్, కుమ్మరి అనంత, ఎం. యాదమ్మ, గ్రామ సెక్రటరీ బాల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు. మండల విద్యాధికారి సూచనలతో పాఠశాలల్లో హాజరు, పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజనం దృష్టి పెట్టాలని అధికారులు సూచించారు.

# ప్రజలు మెచ్చే పాలన అందించాలి

- శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులు
- సర్టిఫికెట్లను అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,సీఈఓ కృష్ణారెడ్డి





**తలకొండపల్లి మార్చి07(జనంసాక్షి):** కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలలో ప్రజలు మెచ్చే పాలనను అందించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రంగారెడ్డి జిల్లా సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు.తలకొండపల్లి మండలంలోని 32 గ్రామాలకు చెందిన సర్పంచులకు పంచాయతీరాజ్ చట్టం,పాలన విధివిధానాలపై అవగాహన కల్పించేందుకు శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ స్వర్ణ భారతి ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 5 రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి.ఈ సందర్భంగా శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రసంగించారు.పల్లెలను ప్రగతి బాటలో నిలపడం కోసం సర్పంచులు బాధ్యతాయుతంగా పని చేయాలని అన్నారు.శిక్షణ పొందిన సర్పంచులు సుపరిపాలన అందించి గ్రామాలను ఆదర్శంగా నిలపాలని సూచించారు.అంతకముందు శిక్షణ పొందిన సర్పంచులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సర్పంచులు కాసు శ్రీనివాస్ రెడ్డి,మాకం వీరేశలింగం,కటికల శేఖర్,కడారి రామకృష్ణ, అవురు చింతల రమేష్,జినుకుంట్ల చంద్రశేఖర్,శేఖర్ యాదవ్, మహేష్, మల్లేష్, డోకూరి సునీత, మేరిగా భారతమ్మ, కొర్ర శిరీష, వాన రాశి రాములమ్మ, గుజ్జుల లక్ష్మమ్మ, అనిత, సొల్లు రంగమ్మ, వట్టెల నిర్మల, రజిత, వివిధ గ్రామాల సర్పంచులు, మాస్టర్ ట్రైనర్లు, అధికారులుపాల్గొన్నారు.

## నేడు కొందుర్గు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత





**కొందుర్గు (జనంసాక్షి):** కొందుర్గు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర నిర్వహణ (మెయింటెనెన్స్) పనుల కారణంగా రేపు (ఆదివారం) 08-03-2026 విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని 33 కేవీ , 11 కేవీ లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా రేపు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపి వేస్తు న్నట్లు ఆయన పేర్కొన్నారు. కొందుర్గు మండల కేంద్రంతో పాటు ఆ సబ్‌స్టే షన్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లోని వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కొందుర్గు మండల ఏఈ రవికుమార్ కోరారు.

## ఐటీసీ యిప్పీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాల అవగాహన కార్యక్రమం



**ఖైరతాబాద్, మార్చి 07 (జనంసాక్షి) :** ఐటీసీ సన్‌ఫీస్ట్ యిప్పీ తమ బెటర్ వరల్డ్ సిఎస్ఆర్ కార్య క్రమంలో భాగంగా తమ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కార్యక్రమంను హైదరాబాద్‌కు తీసుకువచ్చింది. విద్యార్థులు, స్థానిక సమాజంలో పర్యావరణ స్పృహను పెంపొందించడానికి, అగస్త్య ఇంటర్నే షనల్ ఫౌండేషన్ సహకారంతో, ఆర్సి పురంలని అక్షర విద్యామందిర్‌లో భారీ అవగాహన కార్యక్రమా న్ని నిర్వహించింది. ఈ మేళాను డాక్టర్ ఎ.రామ చందర్ రావు(డిఆర్డిఓ శాస్త్రవేత్త) ప్రారంభించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులలో ప్లాస్టిక్ కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పిం చడంతో పాటుగా వ్యర్థాలను తగ్గించడం (రెడ్యూ స్), పునర్వి నియోగించటం(రీ యూజ్), పునరావి ష్కరించటం(రీసైకిల్)వంటి పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడానికి ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమం యిప్పీ బెటర్ వరల్డ్ యొక్క లక్ష్యమైన 'మార్పును సృష్టించేవారితో కూడిన సమాజాన్ని నిర్మించడానికి, చిన్న వయస్సు నుండే పర్యావరణ పరిరక్షణ పట్ల పిల్లలలో అభిరుచిని పెంపొందించటానికి వారు ఆస్వాదించే రీతిలో ప్రోత్సహించాలతో సంపూర్ణంగా సరిపోతుందని ఐటిసి లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ సురేష్ చంద్ అన్నారు. ఐటిసిలో పర్యావరణ పరిరక్షణ, విద్య ఒకదానికొకటి ముడిపడి ఉంటాయని తాము నమ్ముతున్నామని అన్నారు. యిప్పీ బెటర్ వరల్డ్ ప్రోగ్రామ్ మన గ్రహం కోసం బాధ్యతాయుతమైన పౌరులుగా నిలిచేలా జ్ఞానం, ప్రేరణతో పిల్లలను సన్నద్ధం చేయడానికి కట్టుబడి ఉందన్నారు. అక్టీ లెర్న్ విద్యా పుస్తకాల వంటి కార్యక్రమాల ద్వారా , తాము పర్యావరణ అనుకూల రేపటి కోసం విత్తనాలను నాటుతున్నామని అన్నారు. సంగా రెడ్డి జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఎంఈఓ రాము లు, సంగారెడ్డి జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు ప్రమోద్, రీజనల్ ఎక్స్పీరియన్స్ బలరాం, ఏపిటిఎస్ రీజియన్ నాయకులు డాక్టర్ ఏ.రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని అక్షర విద్యామందిర్ నుండి 2,100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన డంతో పాటుప్లాస్టిక్ వ్యర్థాల అవగాహనకు సంబం ధించిన 150 ప్రాజెక్టుల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టర్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహ ణపై సైన్స్ నమూనాలు, పునర్వినియోగ ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలపై ప్రదర్శన వంటి వివిధ కార్యక లాపాలు ప్రదర్శించారు.

# భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం






- **భూ సర్వేకు గ్రామ ప్రజలంతా సహకరించాలి**
- **ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కేశంపేట, మార్చి 7 (జనంసాక్షి) :** రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో రెవిన్యూ అధికారులు భూ సర్వే చేపట్టి నక్ష మ్యాప్ తయారు చేయడానికి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. గ్రామ సభలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. గ్రామానికి నక్ష లేకపోవడంతో సమస్యను చాలాసార్లు రైతులు తన దృష్టికి తీసుకు వచ్చార న్నారు. రైతుల ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశంతో భూ సర్వే చేపట్టడం జరుగుతుం దన్నారు. రెవెన్యూ అధికారులకు గ్రామస్తులంతా సహకరించాలని అన్నారు. సర్వేకు ఎలాంటి అడ్డం కులు లేకుండా గ్రామ పెద్దలంతా ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం దేవుని తండా గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. తండా ముఖ ద్వారం నుండి బాలాజీ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే ఏడి రామ్ రెడ్డి, తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్లూరి జగదీశ్వర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాలా శ్రావణ్ రెడ్డి, సర్పంచులు రమేష్ యాదవ్, వి. సుజాత హనుమంతు నాయక్, ఏదిరే నాగేశ్వర్, కొట్టం నరేందర్ రెడ్డి, మామిడిపల్లి భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణా కర్, నాయకులు బీస కరుణాకర్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, రావుల పెంటయ్య, పల్లెమోని నర్సిం లు, యండి ఇబ్రహీం, త్రిప్పిశెట్టి సుదర్శన్, బండెల రాజేందర్ రెడ్డి, అల్లు శ్రీధర్ రెడ్డి, రాజ శేఖర్ గుప్తా , వి.కిషన్ నాయక్, గుండె గళ్ళ అంజ య్య, గ్యార సురేష్, హరీశ్వర్ రెడ్డి, మల్లేష్, చేవెళ్ల మహేష్, వన్నడ మనోహర్ గౌడ్, మల్లేష్ యాదవ్, ఆవ రాఘవేందర్ , పారేశ్ యాదవ్, కృష్ణ యాద వ్, కుమార్, నర్సింహా, చిర్ర శ్రీను, పాల్గొన్నారు.

# ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక పరిమళం

### క్వాంటం లైఫ్ యూనివర్సిటీని సందర్శించిన హిమాలయ గురువు జగదీష్ బాబాజీ



**కోట్‌పల్లి (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లాలోని ప్రకృతి రమణీయతకు నిలయమైన నాగసన్‌పల్లి గ్రామంలోని క్వాంటం లైఫ్ యూనివర్సిటీ (ఘూఖ) ఒక అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రమని హిమాలయ గురువు జగదీష్ బాబాజీ కొనియాడారు. డాక్టర్ న్యూటన్, డాక్టర్ లక్ష్మి గార్ల నేతృత్వంలో సాగుతున్న ఈ మహత్తర కార్యకలాపాలను వీక్షించేందుకు ఆయన ప్రత్యేకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా బాబాజీ ప్రసంగిస్తూ ప్రకృతి, ధ్యానం మరియు గోసేవపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు:

**1. ప్రకృతిపై అపారమైన ప్రేమ - లక్ష వృక్ష యాగం**

150 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ ప్రాంగణంలో 80 శాతం భూమిని కేవలం మొక్కలకే కేటాయించడం అభినందనీయమని బాబాజీ అన్నారు. "ప్రకృతిని ప్రేమిస్తే, ఆ ప్రకృతి మనల్ని రక్షిస్తుంది" అని చెబుతూ, ఇక్కడ నాటిన ఔషధ గుణాలున్న మొక్కలు ప్రాణవాయువును అందించడమే కాకుండా మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. ముఖ్యంగా 'లక్ష వృక్ష యాగం' సంకల్పం ద్వారా లక్ష మొక్కలు నాటాలనే తపన రాబోయే తరాలకు ఒక గొప్ప దిశానిర్దేశమని ఆయన ప్రశంసించారు.

**2. గోమాత సేవ - 55 గోవుల గోశాల**

యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న 55 గోవుల గోశాలను బాబాజీ ప్రత్యేకంగా సందర్శించారు. భారతీయ సంస్కృతిలో గోవుకు ఉన్న ప్రాముఖ్య తను వివరిస్తూ, గోశాల నిర్వహణ ఆధ్యాత్మిక శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. గోవుల సాన్ని ధ్యం మరియు గోసేవ వల్ల కలిగే సాత్విక శక్తి ధ్యానానికి ఎంతో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

**3. శ్వాస మీద ధ్యాస - ఆరోగ్యానికి రాజమార్గం**

"శ్వాస మీద ధ్యాస" అనే సరళమైన ప్రక్రియ ద్వా రా అటు సైన్స్‌ను, ఇటు ఆధ్యాత్మికతను జోడించి ప్రజలకు ధ్యాన మార్గాన్ని సులభతరం చేయడం గొప్ప పరిణామమని బాబాజీ అభిప్రా యపడ్డారు. ధ్యానం ద్వారా ఆరోగ్యం: కేవలం మందులతోనే కాకుండా, ధ్యానం ద్వారా శరీరం లోని అంతర్గత శక్తిని జాగృతం చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని ఎలా పొందవచ్చో ఇక్కడ నేర్పిస్తున్న తీరును ఆయన మెచ్చుకున్నారు. ఇక్కడి పిరమిడ్ మాస్టర్ల ఆధ్వర్యం లో ధ్యానం చేసే అవకాశం లభించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని ఆయన అన్నారు.

**4. భావితరాలకు దిశానిర్దేశం**

ధ్యానం, శాఖాహారం, పర్యావరణ పరిరక్షణ అనే మూడు సూత్రాలతో క్వాంటం లైఫ్ యూనివర్సిటీ సమాజానికి ఒక కొత్త దిశను చూపిస్తోందని బాబా జీ ఆకాంక్షించారు. ఈ మహోన్నత ఆశయంతో సాగుతున్న డాక్టర్ న్యూటన్ దంపతులిని ఆయన మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ కార్యక్ర మంలో క్వాంటం లైఫ్ యూనివర్సిటీ సభ్యులు, ధ్యాన ప్రి యులు , నాగసన్‌పల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాజీ సందేశాన్ని ఆలకించారు.

## నాగోల్ సర్కిల్ కార్యాలయంలో పారిశుధ్య కార్యక్రమం ప్రారంభం

**అబ్దుల్లాపూర్ మెట్టు, (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి నివేదిక" కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నాగోల్ సర్కిల్ కార్యాలయంలో పారిశు ధ్య కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా నాగోల్ సర్కిల్ కార్యాలయం మరియు మన్సూరా బాద్ వార్డు కార్యాలయాలలోని అన్ని విభాగాల కార్యాలయ పరిసర ప్రాంతా ల్లో ప్రత్యేకంగా శుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచే చర్యలు తీసుకు న్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి జూన్ 12 వరకు ప్రణాళికబద్ధంగా ప్రతి రోజు వివిధ కార్యక్రమాలతో నిర్వహించి విజయవంతం చేస్తామని నాగోల్ సర్కిల్-11 డిప్యూటీ కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు మెరు గైన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



### అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలో చెరువులు,

# ప్రభుత్వ భూముల కబ్జాలపై సీపీఎం ఆందోళన




**అబ్దుల్లాపూర్ మెట్టు, (జనంసాక్షి):** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం సీపీఎం పార్టీ మండల కమిటీ సమావేశం పార్టీ కార్యాలయంలో జి. శివ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మండలంలో ఉన్న స్థానిక సమస్యలపై కేంద్రీకరించి పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, వాగులు పెద్ద ఎత్తున కబ్జాలకు గురవుతున్నాయని ఆరోపించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, బ్రోకర్లు కలిసి చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు బ్రోకర్ల వద్ద నుంచి డబ్బులు తీసుకుని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల కబ్జాదారులు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనాజ్‌పూర్ గ్రామంలో అనాదిగా ఉన్న ఇందిరమ్మ సాగర్, వేముల చెరువులపై కూడా కబ్జాలు జరుగుతున్నాయని చెప్పారు. జీనియస్ రియల్ ఎస్టేట్ సంస్థ చెరువు ప్రాంతంలో సగం వరకు రోడ్డు వేసిందని, మరోవైపు ఫిలిం సిటీ యాజమాన్యం చెరువులో భారీ గోడ నిర్మించిందని ఆరోపించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ జాయింట్ సర్వే చేసి చర్యలు తీసుకోకుండా వదిలేశారని అన్నారు. ఇదే కాకుండా పోల్కమ్మ చెరువు (తారామాసిపేట), బైరాన్ ఖాన్ చెరువు, జాఫర్ చెరువు, పోచమ్మ చెరువు వంటి అనేక చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పెద్ద అంబర్‌పేట్ నుంచి కొత్తగూడెం వరకు వెళ్లే భారీ వాగు కూడా అనేక చోట్ల ఆక్రమణలకు గురవుతోందని తెలిపారు. ప్రభుత్వ భూముల విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉందని అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రంలోని సర్వే నంబర్ 283, బాటసింగారం, ఇనాం కుడా సర్వే నంబర్ 10, బండరావిరాల సర్వే నంబర్ 293లో ఉన్న ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు సుమారు పది ఎకరాల వరకు కబ్జా చేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. పెద్ద అంబర్‌పేట్‌లోని సర్వే నంబర్లు 244, 64, 123లో కూడా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో అర్హులైన పేదలకు 60 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రయత్నిస్తే ముందే కేసులు పెడుతున్నారని అన్నారు. మండలంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలకు గురవుతున్నాయో వాటిని గుర్తించి పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, రైతులకు సాగుభూములు ఇప్పించేందుకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని ఏర్పుల నరసింహ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు, వాగులు, కుంటలపై జరుగుతున్న కబ్జాలను పరిశీలించి వాటిని రక్షించాలని, అలాగే ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు, రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మణికొండ జడ్‌పి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌కు సన్మానం



**రాజేంద్రనగర్, మార్చి 7 (జనంసాక్షి):** మణికొండ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ ఆధ్వర్యంలో పాఠశాల మంచి అభివృద్ధి సాధించి, మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిందని వి ఆర్ 4 సహయోగ్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. మేలిమి బంగారం వంటి విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇటీవల నిరంజన్ కు పదోన్నతితో పాటు ఎంఈఓ గా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆనందం వ్యక్తం చేస్తూ ట్రస్టు సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి చిరుకానుక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు, సీతారాం ధూళిపాళ, దిలీప్ కక్కడ్, కుంబగళ్ల ధనరాజ్, హరి హరనాథ్ రెడ్డి, భాను చందర్, ప్రవీణ్, షేక్ ఆరిఫ్, సుబ్రమణ్యం, కామేశ్వర్ రావు, ముక్తేశ్వర రావు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో రైతులకు శిక్షణ

### వ్యవసాయ సంచాకులు సురేష్ బాబు



**షాబాద్, మార్చి 07(జనంసాక్షి) :** ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం కాపాడడంతో పాటు రైతు ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని వ్యవసాయ సంచాకులు సురేష్ బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, షాబాద్ వ్యవసాయ అధికారి దండెం విజయచంద్రతో కలిసి వ్యవసాయ సంచాకులు సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... నానో ఎరువుల వినియోగం గురించి రైతులకు వివరిస్తూ నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను సరైన మోతాదులో పిచికారి చేయడం ద్వారా పంటల ఎదుగుదల మెరుగుపడుతుందన్నారు. ఒకే పంటగా పత్తి సాగు చేస్తే కొన్ని ప్రాంతాల్లో పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని, అందువల్ల పంట మార్పిడి చేయడం మంచిదని సూచించారు. కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, ఏఈఓ లు శివతేజ, లిఖిత, రాజేశ్వరి, గాయత్రి, గీత, మౌనిక ఐఎఫ్ఎఫ్సిఓ ఎరువుల కంపెనీ మార్కెట్ డెవలప్మెంట్ ఆఫీసర్ సంజయ్ భరద్వాజ్, షాబాద్ రైతు పెడ్ఫార్మ్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో చంద్రశేఖర్ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘం నాయకులు యాదవ రెడ్డి , రైతులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తోనే మెరుగైన వాతావరణం

### ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
### మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి





**తాండూరు (జనంసాక్షి):** పరిసరాల పరిశుభ్రత తోనే మెరుగైన వాతావరణం లభిస్తుందని మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం పట్టణంలో ని 13వ వార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పట్టణంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వేయవద్దని కోరారు. చెత్తను రోడ్ల పైన వేస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయి అని, ప్రజలు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని వివరించారు. మనం రోడ్ల పైన వేసే చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికుల ఆరోగ్యానికి కూడా మనం చూడవలసిన బాధ్యత ఉందని ఆమె ప్రజలకు గుర్తు చేశారు. కమిషనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవద్దని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు రావని విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ తారా సింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, కౌన్సిలర్ సురేష్, మేనేజర్ నరేందర్ రెడ్డి, టిపిబిఓలు ప్రియా, నరేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ లు వెంకటయ్య, ఉమేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ గౌడ్, వార్డ్ ఆఫీసర్ రాఘవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా చైర్పర్సన్ నీరజబాల్ రెడ్డి, కమిషనర్ మధుసూదన్ రెడ్డిలు కార్మికులకు శాలువాలతో సన్మానించారు.

## అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుపై సమస్యలు

- పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- స్థానికుల ఫిర్యాదులతో ఘటన స్థలానికి చేరుకున్న మంత్రి
- త్వరిత చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు



**అంబర్పేట్ (జనంసాక్షి):** నగరంలోని అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుపై నెలకొన్న సమస్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో మంత్రి ఘటన స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులను నిశితంగా పరిశీలించారు. అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డులో మురుగు నీరు నిల్వ ఉండడం, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఎక్కడైనా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోతే తక్షణమే మరమ్మతులు చేయాలని, చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా సర్వీస్ రోడ్డుపై వాహనాలు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కూడా మంత్రి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలనలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని మంత్రి హామీ ఇవ్వడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## జనంసాక్షి కథనానికి స్పందించిన అధికారులు

**మర్పల్లి మార్చి 07 (జనంసాక్షి):** శుక్రవారం జనం సాక్షి దినపత్రికల్లో క్రీడా ప్రాంగణాలపై పట్టిం పేది.. పిచ్చి మొక్కలు పొదలు తాగుబోతులకు అడ్డగా క్రీడా ప్రాంగణాలు కథనానికి ..... కొత్తలాపూర్ గ్రామంలో ఉన్న క్రీడా ప్రాంగణాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మీ మాధవరెడ్డి, గ్రామ కార్యదర్శి రవిశెట్టి తో కలిసి శనివారం క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న ఈ విరిగిన బోర్డును బాగు చేయించేందుకు తీసుకెళ్లారు. అక్కడ ఉన్న పొదలు చి మొక్కలను జెసిపి సహాయంతో శుభ్రం చేయించారు.



## మల్కాజిగిరి కమిషనరేట్‌లో

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




**ఉప్పల్ మార్చి 07 (జనంసాక్షి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉప్పల్లోని శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సమాజంలో వారి కీలక పాత్రపై అధికారులు మాట్లాడారు. మహిళలు కుటుంబం నుండి సమాజం వరకు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, వారి కృషి దేశ అభివృద్ధికి ఎంతో దోహదపడుతోందని పేర్కొన్నారు. మహిళల భద్రత, గౌరవం కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసు సిబ్బందిని సత్కరించారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, అన్యాయాలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచిస్తూ, మహిళల భద్రత కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ వేడుకల్లో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, క్రైమ్ విభాగాలకు చెందిన అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పలువురు సిబ్బంది పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

# సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి**

**ముషీరాబాద్ (జనంసాక్షి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 01 సెప్టెంబర్ 2004కు ముందు నియామక నోటిఫికేషన్లు విడుదలైన తరువాత నియామకాలు పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (జూూ) నుంచి బయటకు తీసి పాత పెన్షన్ విధానం (ూూూ)లో చేర్చాలని, 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి డిమాండ్ చేసింది.విఈ మేరకు శనివారం హైదరాబాదు ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వేదికగా నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్ కుమార్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోలు 57/04/2019, 57/05/2021 ప్రకారం 2003 నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగులను పాత పెన్షన్ పరిధిలోకి తీసుకు రావాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 01 సెప్టెంబర్ 2004 నుంచి జూూ అమలు చేసినప్పటికీ, ఆ తేదీకి ముందే విడుదలైన నియామక నోటిఫికేషన్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో తరువాత నియమితులైన ఉద్యోగులను బలవంతంగా జూూ పరిధిలోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 22 డిసెంబర్ 2003కు ముందు విడుదలైన నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగు లను పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావడానికి అనుమతి ఇచ్చిందని తెలిపారు. అదే విధంగా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు కూడా కేంద్ర మెమో ఆధారంగా ఈ విధానాన్ని అమలు చేశాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా 2003 నోటిఫికేషన్ల ఆధారంగా నియమితులైన సుమారు 9 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయు లు ఇప్పటికీ జూూ విధానంలో కొనసాగుతూ అన్యా యానికి గురవుతున్నారని తెలిపారు. వీరిని పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువచ్చినా ప్రభుత్వంపై తక్ష ణ ఆర్థిక భారం ఉండదని, ఉద్యోగుల ఖాతాల్లో ఉన్న నిధుల ద్వారా రాష్ట్ర ఖజానాకు సుమారు 1,800 కోట్ల రూపాయలు జమ అయ్యే అవకాశం ఉందని వివరించారు. ఉద్యోగ విరమణ సమయం లో మాత్రమే రూపంలో చెల్లింపులు జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే



స్పందించిలో ఉన్న 2003 ఉద్యో గులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకువచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పులిపాక కేషన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నల్ల రాజేందర్ రెడ్డి, అంబెల్లి శంకర్, నూనెముంతల వెంకటేశం గౌడ్, పెద్దిడిగి రాఘవేందర్ గౌడ్, సంక్రాతి రవి కుమార్, బండి రమేష్, మహమూద్, తల్లాడ కిషోర్, బెండ్ల రాజేష్, ఎల్. అంజుల్ రెడ్డి, చిందం సుభాష్, రావుల లక్ష్మణ్, పెనుమల్లి నర్సింగం, కడుమూరు అయ్యావ పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొని నిరసనకు సంఘీభావం తెలిపారు.

# తుర్కపల్లిలోని ప్రజయ్ వాటర్ ప్లాంట్ ఫేస్ 2లోని సమస్యలు పరిష్కరించాలి



**శామీర్ పేట్, మార్చి 7 (జనంసాక్షి):** అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి లో గల ప్రజయ్ వాటర్ ఫ్రంట్ ఫేస్ 2లో ఉన్న సమస్య లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ కు ప్రజయ్ వాటర్ ప్లాంట్ కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ.. తుర్కపల్లిలోని ప్రజయ్ వాటర్ ఫ్రంట్ ఫేస్ 2 లో సుమారు 3500 కుటుంబాలు నివసిస్తున్నారని మా కాలనీకి రోడ్డు సరిగా లేదని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రజయ్ వాటర్ ఫ్రంట్ నుండి జినోమ్ వ్యాలీ రోడ్డు వరకు 2 కిలోమీటర్లు పొడవునా సీసీ రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేయ్యాలని కోరారు. అదేవిదంగా ప్రతి వేసవి కాలంలో తీవ్ర నీటి ఎద్దటి ఉంటుందని నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. వీధి కుక్కలతో కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, కుక్కల బెడద లేకుండా చూడాలన్నారు. మా కాలనీని పరిశీలించి ఇక్కడ ఉన్న సమస్యలు రోడ్డు సమస్య, నీటి సమస్య, వీధి కుక్కల సమస్యల వంటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహ్మద్ యూసుఫ్ బాబా, ప్రజయ్ వాటర్ ఫ్రంట్ సిటి ఫేస్ 2 ఓనర్లు, పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన భీమ్ భరత్

**నవాబుపేట్ (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మరియు ఇటీవల భారత పార్లమెంట్ ఏగువ సభ అయిన రాజ్యసభ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువ తో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ మాట్లాడుతూ రాజ్యసభలో భారీ మెజార్టీతో గెలిచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నో సేవలు చేసి తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదర్శంగా చేయాలని భీమ్ భరత్ కోరినారు. వీరితో పాటుగా పాల్గొన్న నవాబ్ పేట మండలం అధ్యక్షులు వెంకటయ్య, బీసీ సెల్ అధ్యకులు శ్రీధర్, పులుమామిడి గ్రామ సర్పంచ్ దాన నర్సింలు పాల్గొన్నారు.



# మానసిక ఆరోగ్య సేవలకు గుర్తింపుగా

## డాక్టర్ నోముల వెంకటేశ్వర్లుకు తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు 2026



**హయత్ నగర్, (జనంసాక్షి):** సికింద్రాబాద్ లోని హరిహర కళా భవన్ లో 2026 మార్చి 8 ఆదివారం సర్ సి.వి. రామన్ అకాడమీ ఆధ్వర్యం లో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, హయత్‌నగర్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రముఖ సైకాల జిస్టు డా.నోముల వెంకటేశ్వర్లు కు మానసిక ఆరోగ్య సేవలకు గుర్తింపుగా "తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు 2026" ను ప్రకటించామని నిర్వాహ కులు తెలిపారు. ఆయన కు 2025 సంవత్సరంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ నుండి "తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు" అందుకున్నారు. మానసిక ఆరోగ్య అవగాహన, ఉచిత కౌన్సెలింగ్ సేవలు, సమాజంలో మానసిక ఆరోగ్యంపై చైతన్యం కల్పించడంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ సంవత్సరం కూడా వరుసగా రెండోసారి ఈ గౌరవం దక్కింది. ఈ అవార్డును కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే, హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ ప్రిన్సి పాల్, కళాశాల అధ్యాపకులు, తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసి యేషన్ సభ్యులు, మానసిక ఆరోగ్య కార్యకర్తలు, మేధావులు డాక్టర్ నోముల వెంకటే శ్వర్లు ని అభినందిస్తూ ప్రశంసలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విద్యా వేత్తలు, సా మాజిక సేవకులు, సాంస్కృతిక ప్రముఖులు, హాజరుకా నున్నారని అన్నారు.

# మున్సిపల్ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తాం

**చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి**

**శామీర్ పేట, (జనంసాక్షి):** మున్సిపల్ అభివృద్ధియే దేయంగా పనిచేస్తామని చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి తెలిపారు. శని వారం శామీర్ పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్ గడి మలక్ పేట లోని 5వ వార్డులో 7.5 లక్షల మున్సిపల్ జనరల్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ విడతల వారిగా అన్ని వార్డులను అభివృద్ధి పరిచి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. మున్సిపల్ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ కన్ రెడ్డి మాలతి మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు గాదె వెంకటేష్, గుర్కా కుమార్, కైరా గణేశ్, థల్లా స్వప్న, ఏఈఈ సనా షాహీన్, స్థానికులు పాల్గొన్నారు.



## గ్రామాల పారిశుధ్య అందరి బాధ్యత..

# గ్రామ సర్పంచ్ మేకల సాయన్న



**వాబుపేట్ (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుద్ధపై నవాబుపేట్ మండల పరిధిలోని గుబ్బెడి ఫతేపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి సెంటర్లలో పారిశుధ్య కార్యక్రమంలో గ్రామం పంచాయతీ ఆవరణలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రాథమిక పాఠశాల. అంగన్వాడి సెంటర్ కు వెళ్లి పాఠశాల ఆవరణలో పారిశుధ్యం పై కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పాఠశాల ఆవరణలో చదరం లేకుండా గ్రామంలో గల్లి గల్లి కి వీధి వీధికి చెత్తను పూర్తిగా ట్రాక్టర్లతో తీసివేసి డంపింగ్ యార్డ్ లో ఏర్పాటు చేయాలని శనివారం గ్రామ సర్పంచ్ మేకల సాయన్న ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు వ్యర్థాల వర్గీకరణ గ్రామంలో పారిశుద్ధపై డంపింగ్ యార్డ్ లలో చెత్తను వర్గీకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని గ్రామ సర్పంచ్ మేకల సాయన్న గ్రామస్తులకు సూచించారు. పర్యావరణకు అని కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్తను తడి పొడి చేసి వ్యర్థాలుగా వేరుచేసి రీ సైక్లింగ్ చర్యను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల నుప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డంపింగ్ యార్డ్ లను పరిసరాలు ప్రాంతాలలో శుభ్రతను కచ్చితంగా పాటించాలని అన్నారు. గ్రామంలో దుర్వాసన తగ్గించే చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్మికులకు తెలిపారు. గ్రామంలో ప్రతి గల్లి గల్లికి ట్రాక్టర్ తిరిగి చెత్తను సేకరించి డంపింగ్ యార్లలో నిల్వ చేయాలని అన్నారు. తడి చెత్త పొడిచెత్త సేకరణ జరగాలని వెహికల్ లో జియో ట్యాపింగ్ సౌండ్ ను ఏర్పాటుచేసి గ్రామంలో చెత్తను పూర్తిగా సేకరించి డంపింగ్ యార్డ్ లో నిల్వ చేయాలని అన్నారు. పంచాయతీ కార్మికులు గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెత్తను గ్రామంలో ఎక్కడ లేకుండా తీసివేయాలి అని చెప్పి ఆయన అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామం పంచాయతీ కార్యదర్శి పాండు పేర్కొన్నారు. పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి సెంట్రల్ టీచర్లు, గ్రామ సర్పంచి మేకల సాయన్న (సామిల్) ఉప సర్పంచ్ అక్బర్, పంచాయతీ కార్యదర్శి పాండు, గ్రామం పెద్దలు యూసుఫ్, రామచంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, గ్రామస్తులు. మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, యువజన సంఘాల నాయకులు, డ్వాక్రాసంఘాల మహిళలు పారిశుధ్య కార్మికులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

### మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
### ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించిన బండారు వైష్ణవ మెమోరియల్ ఫౌండేషన్

**ముషీరాబాద్, (జనంసాక్షి):** మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బాగ్‌లింగంపల్లి లోని సుందర య్య కళా నిలయంలో బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో బండారు వైష్ణవ మెమోరియల్ ఫౌండేషన్ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండా రు దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. మహిళల సాధికారత, సమానత్వం గూర్చి ప్రస్తావించారు. మహిళల కు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. సమాజంలోని వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ మహిళలను ఈ సందర్భంగా సత్కరించారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, మహిళలు సాధించిన విజయాలు భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాధవిలత, పద్మజా రెడ్డి, సునైనా సింగ్, ఇఫ్లూ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, రమాదేవి, దీప్తి వాజపేయి, సహా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన పలువురు మహిళా ప్రతిభావంతులు, పలువురు ప్రముఖులు, మహిళా నాయకులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' ప్రారంభం

### పరిపాలనలో పారిశుద్ధ్యానికి పెద్దపీట
### కార్యక్రమాన్ని ప్రారంభించిన కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్



**కొందుర్గు (జనంసాక్షి):** కొందుర్గు మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మొదటి రోజు కార్యక్ర మాలు శనివారం విజయవంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు మరియు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ ప్రాంతం తరగతి గదులు ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు చురుగ్గా పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ శానిటేషన్ సిబ్బంది పాఠశాలలు, కార్యాలయాల పరిసరాలను శుభ్రపరిచి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేపట్టారు. మండల కాంగ్రెస్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమ వంతు సహకారాన్ని అందించారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగే ఈ 99 రోజుల ప్రణాళికలో భాగంగా మొదటి వారంలో పారిశు ద్ధ్యం , పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజారోగ్యం , ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ 99 రోజుల ప్రణాళికను మండలంలో పకడ్బందీగా అమలు చేస్తామని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## డబల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉండాలి

### పట్టా సర్టిఫికెట్లు పొందిన డబల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉండకపోతే రద్దు చేస్తాము
### కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి



**మహేశ్వరం, (జనంసాక్షి):** మహేశ్వరం మండలం మంఖాల్ డబల్ బెడ్ రూమ్ లో గతంలో పట్టా సర్టిఫికెట్లు పొందిన వారు డబల్ బెడ్ రూమ్ లోనే నివాసం ఉండాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి అన్నారు. పట్టా సర్టిఫికెట్లు పొందిన వారు నివాసం ఉండకపోతే వాటిని రద్దు చేస్తామన్నారు. కొత్త వాళ్లకు అలాట్మెంట్ చేస్తామన్నారు. పట్టాలు మంజూరై ఇంకా పట్టా సర్టిఫికెట్లులు తీసుకొని వాళ్ళు వెం టనే పట్టా సర్టిఫికెట్లు తీసుకున్నట్లయితే పట్టా సర్టిఫికెట్లు కూడా రద్దు చేయడం జరుగుతుందన్నారు. డబల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉంటున్న ఇతరులకు అద్దెకు ఇవ్వడం చెల్లదన్నారుకు ఇచ్చినట్లయితే రద్దు చేయడం జరుగుతుందన్నారు.

**పరిశుభ్రంగా ఉంచాలి**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కందుకూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛత కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నిరుపయోగంగా ఉన్న వాటిని ఉపయోగంలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపాల్,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలి : చైర్మన్ జామ్ రవి



**శామీర్ పేట, మార్చి 7 (జనంసాక్షి):** ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించా లని మున్సిపల్ చైర్మన్ జామ్ రవి తెలిపారు. శనివారం మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పోతారం, నారాయణపూర్, అనంతరం వార్డుల్లో 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 2వ రోజు రోడ్లను శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వార్డుల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పవన్ కుమార్, కౌన్సిలర్లు వంగ ప్రియాంకరెడ్డి, ముద్దం పాపిరెడ్డి, ర్యాకల నీరజ్ గౌడ్, నవీన్ నాయక్, చిన్న లచ్చ సరిత శ్రీనివాస్, పెద్దిరెడ్డి శ్రీలత, రాజిగల్ల లత, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

# ఉప్పల్ భగాయత్‌లో భారీ అభివృద్ధి

- ఎంఎంసీ కార్యాలయ సముదాయం ఏర్పాటుకు రంగం సిద్ధం
- 10 ఎకరాల్లో ఆధునిక సదుపాయాలతో నిర్మాణం
- నిన్న ఉన్నతాధికారుల పరిశీలన
- ఈరోజు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శన



**ఉప్పల్ మార్చి 07 (జనంసాక్షి):** నగర పరిసర ప్రాంతాల్లో పరిపాలనను మరింత సమర్థవంతంగా చేయడానికి మరియు ప్రజలకు ప్రభుత్వ సేవలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడానికి ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో భారీ అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక సదుపాయాలతో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కార్యాలయ సముదాయం నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ సముదాయం నిర్మాణం పూర్తయితే ప్రజలకు అవసరమైన పలు ప్రభుత్వ శాఖల సేవలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అధికారుల స్థల పరిశీలనఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి నిన్న ఉన్నతాధికారులు ఉప్పల్ భగాయత్ ప్రాంతాన్ని సందర్శించి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. నిర్మించబోయే కార్యాలయ సముదాయం నమూనాలు, భవనాల నిర్మాణ విధానం, పార్కింగ్ సదుపాయాలు, రహదారి అనుసం ధానం, భవిష్యత్తులో విస్తరణకు ఉండే అవకాశాలు వంటి అంశాలపై అధికా రులు సమగ్రంగా పరిశీలించారు. నగరంలోని పలు ప్రభుత్వ శాఖలు ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తుండటంతో ప్రజలు చిన్నచిన్న పనులకే పలుచోట్ల తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అన్ని ముఖ్యమైన శాఖల కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఈ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శన**

అదే స్థలాన్ని ఈరోజు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన భగాయత్ ప్రాంతంలో జరుగుతు న్న పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా ఈ ప్రాంతంలో ఎంఎంసీ కార్యాలయ సముదాయం ఏర్పాటు దిశగా చర్యలు వేగవంతమవు తున్నాయని స్థానిక నాయకులు పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన స్థల చదునుపరచడం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైనప్పటి నుంచి ఆధునిక ప్రమాణాలతో సరికొత్త కార్యాలయ భవనం నిర్మించాలనే ఆలోచన ప్రభుత్వ స్థాయిలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన విశాలమైన భూమి అందుబాటులో ఉండటంతో పాటు నగరానికి చేరువలో ఉండటం, విశాలమైన రహదారులు, పార్కులు, మౌలిక సదుపాయాలు ఉండటం వల్ల ఈ ప్రదేశం అత్యంత అనువైనదిగా అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులు ఆ స్థలాన్ని యుద్ధప్రాతిపదికన చదునుపరుస్తున్నారు. నగరానికి కేంద్రబిందువుగా ఉప్పల్ భౌగోళికంగా కూడా మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలో ఉప్పల్ ప్రాంతం కేంద్రబిందువుగా ఉండడం, ప్రజలకు రవాణా సౌకర్యాలు సులభంగా ఉండటం వంటి అంశాలు ఈ ప్రాజెక్ట్‌కు అనుకూలంగా ఉన్నాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందేలా అన్ని శాఖల కార్యాలయాలను ఒకేచోట ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. పలు శాఖల కార్యాలయాలు ఒకేచోటఈ సముదాయం నిర్మాణం పూర్తయితే రెవెన్యూ, మున్సిపల్, ఇంజినీరింగ్, ప్రజా సేవలకు సంబంధించిన పలు విభాగాల కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రజలు ఒక పని కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రభుత్వ సేవలు వేగంగా అందడంతో పాటు ప్రజలకు సమయం, ఖర్చు కూడా ఆదా అవుతుందని అధికారులు పేర్కొన్నారు. త్వరలో ప్రభుత్వ అనుమతులుఈ ప్రాజెక్ట్‌కు సంబ ంధించిన ప్రతిపాదనలను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించి అవసరమైన అనుమతులు పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశ ముందని చెప్పారు. ఈ సముదాయం నిర్మాణం పూర్తయితే ఉప్పల్ ప్రాంతం పరిపాలనా కేంద్రంగా మరింత అభివృద్ధి చెందే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి

### మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్

**బొంరాస్ పేట, (జనంసాక్షి):** చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసేందు కు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నాడని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఏర్పుమళ్ళ గ్రామ సర్పంచ్ బందెయ్యతో కలిసి గ్రామ శివారులోని గుండ్లకుంట చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. రూ.48 లక్షల వరకు కాడ నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ నిధుల ద్వారా కుంటకట్ట బలోపేతం, కొత్త తూము ఏర్పాటు, అలుగు నిర్మాణం తదితర పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. నిధులు మంజూరు కావడం పట్ల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య,బాబు,వెంకట్రాములు, పాల్గొన్నారు.



# యాచారం మండలంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు



**యాచారం, (జనంసాక్షి):** యాచారం మండలంలోని అన్ని గ్రామాల్లో మధ్యము బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. గుడి బడి నివాస ప్రాంతాలనే తేడా లేకుండా బెల్ట్ షాపుల ద్వారా యదేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎక్సైజ్, పోలీస్ శాఖ కనుసన్నల్లోనే బెల్టు షాపులహవా కొనసాగుతుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ముఖ్యంగా నందివ నపర్తి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా రేయింబవళ్లు విక్రయా లు సాగుతున్న నియంత్రించాల్సిన అధికారులు నామ మాత్రపు దాడులైన చేయకపోవడం విమర్శలకు తావి స్తోంది. బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. విద్యార్థులు మహిళలు ఇబ్బంది పడుతు న్నారని వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



**మద్యానికి బానిస అవుతున్న యువత...**

గ్రామాలలో బెల్ట్ షాపులు జోరుగా సాగుతుండడంతో వయస్సుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిస అవుతూ జీవితాలను నాశనం చేసుకుం టున్నారు. ముఖ్యంగా ఆమనగల్ మండలంలోని మంగళపల్లిలో, ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, కోనాపూర్, మేడిగడ్డ గ్రామాలలో మద్యం ఏరులైపారుతున్న సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమాలకు తావిస్తోంది.

**కిరాణా కొట్టులే...బెల్టు షాపులు...**

ఒకప్పుడు బెల్టు షాపులు గ్రామానికి రెండు మూడు భయం భయంగా నిర్వహించేవారు. కానీ నేడు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. అయితే బెల్టు షాపులు అంటే మద్యం దుకాణాల్లా కనిపించవు. గ్రామాల్లో ఉన్న కిరణా షాపుల్లోనే చాలావరకు మద్యము అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఏ రాత్రి అయి నా వీరికి మద్యం లభిస్తుంది. ఎన్నికల సమయంలో దాడుల్లో నిర్వహించే ఆబ్కారి శాఖ, పోలీసులు మళ్లీ గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారీతిన బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు కొనసాగుతు న్నాయని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు.

# బీరప్ప గడ్డలో రూ.27 లక్షలతో సీసీ రోడ్డు పనులు

**పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా**

**ఉప్పల్ మార్చి (జనంసాక్షి):** చిల్కానగర్ డివిజన్ పరిధిలోని బీరప్ప గడ్డ ప్రాంతంలో రూ.27 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పరిశీలించారు. డివిజన్‌లోని బీరప్ప గడ్డ ప్రాంతంలో సత్యనారాయణ కిరాణా షాప్ పక్కన ఉన్న వీధుల్లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల పురోగతిని ఆమె స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మంజూరైన సీసీ రోడ్డు పనులను దశలవారీగా పూర్తి చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న మరియు మంజూరు కాని పనులను కూడా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో త్వరలోనే పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్‌లో ఉన్న అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు కనీసం 4.5 మీటర్ల వెడల్పుతో నిర్మించాలని సూచించారు. పరిస్థితులు అనుకూలంగా లేకపోతే రోడ్డు పొడవును పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, పనుల సమయంలో



బస్తీ వాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనుల సమయంలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆమె కోరారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కోకొండ జగన్, ఎద్దుల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బాలు పాల్గొన్నారు. అలాగే బీరప్ప గడ్డ ప్రాంతానికి చెందిన సత్యనారాయణ, ఆనంద్, ఇంద్రసేనారెడ్డి, శ్రీను, మురళి, నరేష్, జ్యోతి, తరభై, శకుంతల, మనమ్మ అనిత పాల్గొన్నారు.

# ప్రజా క్షేత్రంలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## ఎప్పటికప్పుడు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
## బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింహులు



**తాండూరు మార్చి 7(జనంసాక్షి):** ప్రజా క్షేత్రంలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింహులు పేర్కొన్నారు. శనివారం తాండూర్ పట్టణం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింలు నివాసంలో మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన 12 మంది కౌన్సిలర్లు ఘన విజయం సాధించిన సందర్భంగా కౌన్సిలర్లకు ఘన సన్మానం చేశారు. బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింహులు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు వార్డు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు వదిలే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ 12 మంది కౌన్సిలర్లు కలిసి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా ఎన్నికైన సందర్భంగా దీప నర్సింహులును ఘనంగా సన్మానించారు. ఈ. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**పెద్దేముల్ (జనంసాక్షి):** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామ శివారులో శనివారం రాత్రి, ఇసుకను తరలిస్తుండగా ఎస్సై ప్రశాంత్ వర్ధన్,వారి సిబ్బంది ట్రాక్టర్‌ను ఆపి ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు చూయించాలని అడిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకుని పెద్దేముల్ పోలీసస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ రుక్మాపూర్ గ్రామానికి చెందిన తో తోపోజీ. చంద్రప్ప పై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

# ఉప్పల్ భగాయత్ - హబ్సిగూడలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా మహిళలకు సన్మానాలు, చీరల పంపిణీ**
- **ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక గౌరవం**

**ఉప్పల్/హబ్సిగూడ, (జనంసాక్షి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ భగాయత్, హబ్సిగూడ ప్రాంతాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళల ఉత్సాహం, సందడితో కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలు అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పా రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహిళల కోసం పలు వినోదాత్మక ఆటలు, పాటల పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అలాగే భగాయత్ ప్రాంతంలో మహిళలకు ఆరో గ్యపరమైన సలహాలు అందిస్తూ సేవలందిస్తున్న ఆశా వర్కర్ నాగజ్యోతి, అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికురాలి ని స్పాన్సర్ల సహకారంతో సన్మానించి బహుమ తులు అందజేశారు. ఇదిలా ఉండగా హబ్సిగూడ డివిజన్‌లో రజిత రెడ్డి ఆధ్వర్యంలో కూడా మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు మరియు బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ



కార్యక్రమాల్లో మహిళా నిర్వాహకులు మేకల లావణ్య, మేకల మేఘమాల, మంజుల, స్వర్ణలత, సుజాత, స్వప్న, రవళి, గాయత్రి, స్వాతి రెడ్డి, డాక్టర్ కౌటిల్య రెడ్డి, నేహా, డాక్టర్ సింధూరి, రాధా, కరుణ, అపర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.. అలాగే అసోసియేషన్ సభ్యులు సుభాన్ రెడ్డి, ముజాకరి పవన్, రంగనాథ్, బంగ్లా శ్రీనివాస్ రెడ్డి, వినయ్ సాగర్, సుధాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకటయ్య, నరేంద్ర చౌదరి, నవీన్, చంద్రశేఖర్ రావు, వినోద్, రాజు గౌడ్, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు, స్థానికు లు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# పట్టణ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి**

**తాండూరు (జనంసాక్షి):** పట్టణ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం తాండూరు పురపాలక సంఘం కార్యాలయం లో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి . వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ , మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో 99 డేస్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ తాండూరు ప్రాంతం యొక్క శానిటేషన్. ఇంజినీరింగ్. రెవెన్యూ.




సమస్యలు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారుల్ని ఆదేశించారు.

సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మేనేజర్ నరేందర్ రెడ్డి , డి ఇ మణిపాల్ , టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్స్, శానిటరీ జవాన్లు, ఇతర సెక్షన్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సిపిఐ పోరాటం

- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం
- సిపిఐ నిరసన దీక్ష
- సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్




**నిజాంపేట్ (జనంసాక్షి):** జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పై పోరాటం అనే నినాదంతో ప్రగతి నగర్ సర్కిల్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ నిరసన దీక్షను పాలభిందెల శ్రీనివాస్, పొన్నకంటి దస్తగిరి తో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు చేయించగా ముఖ్య అధితిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం ముఖ్య అతిథిగా హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యల పై సిపిఐ పోరాటం అనే నినాదంతో నిరసన దీక్ష నిర్వహించచము అని తెలిపారు. నిజాంపేట్ సర్కిల్లో అంబీర్ చెరువు, తూర్క చెరువు, బైన్ చెరువు, పాపయ్య కుంట, కొత్త కుంట మొదలైన వాటిలో గుర్రపు డెక్కలు పెరగడం వల్ల వాటిని ఆసరా చేసుకొని దోమలు విపరీతంగా ప్రజల పై దాడి చేస్తున్నాయి అని గుర్తు చేశారు. కనుక ముందు గుర్రపు డెక్కలను తొలగించి తరువాత దోమలను నివారించాలి అని అన్నారు. అలాగే నిజాంపేట్ సర్కిల్ పరిధిలో రోడ్లు , డ్రైనేజ్ పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడం చాలా బాధాకరం అని దాని వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతుంది అని అన్నారు. కనుక వెంటనే రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తి చేయాలి అని అన్నారు. బస్తీ దావఖానాలలో డాక్టర్లు, నర్సుల కొరత వల్ల నిరూపయోగముగా వున్నాయి అని వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఎండ కాలం వచ్చింది కనుక ప్రజలకు మంచి నీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తొంబై శాతం అక్షరాస్యత గల నిజాంపేట్ సర్కిల్లో గ్రంధాలయం లేకపోవడం చాలా బాధాకరం అని అన్నారు. గ్రామపంచాయితీగా ఉన్న నాటి నుండి ప్రతి సంవత్సరం ఇంటి పన్నులో గ్రంధాలయనికి పన్ను కట్టుకునే ప్రభుత్వాలు, అధికారులు ముక్కు పిండి పన్ను వసూలు చేశారు తప్ప గ్రంధాలయం కట్టాలని ఆలోచించలేదు అని గుర్తు చేశారు. కనుక వెంటనే గ్రంధాలయం ఏర్పాటు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలనీ, బాచుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయనికి నలుగురు ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి వెళ్తే కనీసం కూర్చోడానికి స్థలం లేక పాత బాచుపల్లి గ్రామపంచాయితీ కార్యాలయని వాడుతున్నారు. కనుక వెంటనే తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే నిజాంపేట్ సర్కిల్లో పని చేసే మున్సిపల్ కార్మికుల, చెత్త బండి నడిపే కార్మికుల, చిరు వ్యాపారుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలనీ వారు డిమాండ్ చేశారు. వెంటనే పై సమస్యలు పరిష్కారం చేయకపోతే నిజాంపేట్ సర్కిల్, రెవిన్యూ కార్యాలయాలు ముట్టడి చేస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత మేకల. నాగేష్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.కృష్ణ, ఆశి. యాదయ్య, బ్రహ్మానందం, కేశవులు, ప్రకాష్ , నాగేష్, గంగన్న, పి. కవిత పాల్గొన్నారు.

# 'బిఆర్ఎస్ నేత నవతారెడ్డి నేతృత్వంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**శేరిలింగంపల్లి, మార్చి 07 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ నేత, చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మాధవరం కృష్ణ రావు తదితరులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను కేటీఆర్, మాజీ మంత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ మహిళలు ప్రస్తుతం సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని, మహిళా సమాజం ఎదుగుదల లేనిదే దేశం అభ్యుదయంవైపు సాగదని తెలిపారు. ఆర్థికంగా బలపడటంకోసం మహిళా సాధికారత చాలా అవసరమన్నారు. మహిళల సంక్షేమ, పురోగతి కోసం అటు ప్రభుత్వం, ఇటు సామాజిక బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. అమ్మాయిలు తమ కాళ్లమీద తాము నిలబడినప్పుడు వ్యవస్థనుండి వచ్చే గౌరవం ఎంతో గొప్పగా ఉంటుందని, ఆ అనుభూతిని పొందినప్పుడు మహిళలు మరింత గొప్పగా ఆలోచించగలుగుతారని కేటీఆర్ వివరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



# కేటీఆర్‌ను కలిసిన సామెల్ రాజ్

**మహేశ్వరం, (జనంసాక్షి) :** మాజీమంత్రి కేటీఆర్‌ను మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు సామెల్ రాజ్ శనివారం కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

# వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ

**తలకొండపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుజ్జారి రాఘవేందర్**



**తలకొండపల్లి (జనంసాక్షి):** యువత ఎంచుకున్న క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గుజ్జారి రాఘవేందర్ అన్నారు.మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలోని యువత వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తారు.వాలీబాల్ క్రీడాకారులకు రాఘవేంద్ర ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత గుజ్జారి రాఘవేందర్ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా రూ,80 వేలు ఖర్చు చేసి 100 క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామానికి చెందిన యువత వివిధ క్రీడల్లో రాష్ట్ర,జాతీయస్థాయిలో రాణించి గ్రామానికి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు.క్రీడల్లో రాణించే యువతకు తమ వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు.వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని యువత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రంలో సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్,ఉపసర్పంచ్ అంబటి వెంకటేష్,వాలీబాల్ యూత్ అధ్యక్షులు పులిజాల మహేష్,ఉపాధ్యక్షులు మద్దూరి వెంకటేష్,వార్డ్ సభ్యులు అంబటి లక్ష్మయ్య, కడమోని రాము,ముసిని కిరణ్,ఎడ్ల రాజు,పులిజాల రాజశేఖర్,,క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పెళ్లిళ్లకు ప్రభుత్వం అండ

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. శనివారం గండి పేట్ మండలం ఖానాపూర్ గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 62 మంది లబ్ధిదారులకు రూ.62 లక్షల 7 వేల 192 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ పథకాల ద్వారా పేదింటి యువతుల వివాహాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుం బాలకు తోడ్పాటు అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె. శ్రీనివాస్ రెడ్డి, నార్సింగి, గుడిమల్కాపూర్ ఏఎంసి చైర్మన్లు కోట వేణు గౌడ్, తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ ఆర్. నరసింహ, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# రంజాన్ మాసం అంటే సహనం, దానం, సోదర భావానికి ప్రతీక

- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉనికిని కోల్పోతున్న పండుగలు
- ఇఫ్తార్ విందులో కేటీఆర్ వ్యాఖ్యలు




**కుత్బుల్లాపూర్ మార్చి 7 (జనంసాక్షి) :** రంజాన్ మాసం అనేది ఆత్మపరిశుద్ధి, సహనం, దానం, సోదర భావానికి ప్రత్యేకగా నిలుస్తాయని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ఆధ్వర్యంలో సూరారం డివిజన్ పరిధిలోని టిఎన్ఐఐసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హిందూ, ముస్లిం ,క్రిస్టియన్ అన్ని మతాల పండుగలకు సముచిత స్థానం కల్పించి ప్రజా రంజక పాలన అందించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాల పండుగ వేడుకలను నిర్వహిం చడంలో చిత్తశుద్ధి కరువైందని ఆరోపించారు. ముఖ్యంగా ఉపవాస దీక్ష ద్వారా మనిషి తనలోని మంచితనాన్ని పెంపొందిం చుకోవడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. సమాజంలో ప్రేమ, ఐక్యత పెరగాలని ఈ పవిత్ర మాసం మనకు సందేశం ఇస్తుందని పేర్కొన్నారు. అందరి జీవితాల్లో శాంతి ,సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీముక్తి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ప్రత్యేక పూజలు పాల్గొన్న శంబీపూర్ కృష్ణ



**నిజాంపేట్ (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్‌డి పోచంపల్లిలో శ్రీ ముక్తి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహో త్సవ కార్యక్ర మం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీముఖి ఆంజనేయస్వామి విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ మహేందర్ యాదవ్, వాడు ప్రెసిడెంట్ కొర్ర అమర్ సింగ్ నాయక్ నాయకులు అనిల్, ఆలయ కమిటీ సభ్యులు మహేందర్ రెడ్డి, నక్క స్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం మెదక్ చిన్న శంకరంపేటలోని శ్రీనివాస్ ఫంక్షన్ హాల్ లో దుండిగల్ నివాసులు ఆకుల ఆంజనేయులు కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ శైలజాఆగి రెడ్డి




**చేవెళ్ల, (జనంసాక్షి)** మహిళలు అన్ని రంగాల్లో రానించాలని చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ శైలజా ఆగి రెడ్డి లు అన్నారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. పౌల్ట్రీ రంగంలో మహిళలు రాణించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ సతీమణి గడ్డం సీతారం జిత్ రెడ్డి, ఐపిఈఎంఏ ప్రెసిడెంట్ ఉదయ్ సింగ్‌బయస్, మహిళలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలు అందించి మంచి గుర్తింపు పొందాలి

### జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి



**శామీర్ పేట, మార్చి 7(జనంసాక్షి):** ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి తెలిపారు. శామీర్ పేట మండలం తూంకుంటలో నర్సింహా ఏర్పాటు చేసిన శ్రీ సాయి భవాని బోన్ సెట్టింగ్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి వైద్య సేవలు అందుబాటులోకి రావడం చాలా ఆనందకరమన్నారు. ఎముకల గాయాలు, మెలికలు వంటి సమస్యలకు చికిత్స అందించే ఈ బోన్ సెట్టింగ్ సెంటర్ తో తూంకుంటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగు తుందని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. అలాగే కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా యజమాని నర్సింహాకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్ఎస్ బాల్ రాజు గౌడ్, మన్నే బిక్షపతి, టీఆర్ రవీందర్ గౌడ్, మేకల అంజనేయులు, సందని ఆనంద్, బాణాల భూపాల్ రెడ్డి, లింగం గౌడ్, సామల దామోదర్ రెడ్డి, పాల్గొన్నారు.

### పోలీసులతో సమన్వయానికి కేసారం

## గ్రామ ప్రతినిధుల ముందడుగు

### ఎస్సై భరత్ భూషణ్‌ను కలిసిన సర్పంచ్

**మోమిన్‌పేట్ మార్చి 7 (జనంసాక్షి):** మోమిన్‌పేట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై భరత్ భూషణ్‌ను కేసారం గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు, గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై భరత్ భూషణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు సహకరించాలని సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య కోరారు. గ్రామ ప్రజల సహకారంతో చట్టాన్ని కాపాడుతూ శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తానని ఎస్సై భరత్ భూషణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసారం గ్రామ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, అబ్బాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీ పేరుతో కల్తీ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు

- విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హెచ్చరిక.
- విజయ డెయిరీ పేరుతో వస్తున్న కల్తీ పాలపై ఆగ్రహం..
- తెలంగాణలో విజయ డెయిరీ పేరుతో నకిలీ పాలు విక్రయిస్తే తీవ్ర పరిణామాలు

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** తెలంగాణలో విజయ డెయిరీ పేరుతో కల్తీ పాలు,పాల ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ విజయ డెయిరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హెచ్చరించారు. లాలాపేటలోని విజయ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కే. చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.విజయ డెయిరీ 1904లో స్థాపించబడిన సంస్థగా రైతుల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని తెలిపారు.ప్రస్తుతం విజయ డెయిరీ ద్వారా రోజుకు సుమారు నాలుగు లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి వినియోగదారులకు నాణ్యమైన పాలను అందిస్తున్నామని చెప్పారు.తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత విజయ డెయిరీ కార్యకలాపాలు రెండు రాష్ట్రాలుగా విడిపోయాయని తెలిపారు.అయితే ఆంధ్రప్రదేశ్‌లో విజయ డెయిరీ బ్రాండ్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మార్కెట్ లో విజయ బ్రాండ్ పేరుతో నకిలీ పాలు,పాల ఉత్పత్తులు విక్రయిస్తూ వినియో గదా రులను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు.కొన్ని సంస్థలు రైతుల నుంచి పాలు సేకరించకుండా విజయ బ్రాండ్ పేరుతో పాలు, నెయ్యి వంటి ఉత్పత్తులను విక్రయి స్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ఇటువంటి కల్తీ ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి హానికరమని,వాటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.మేఘన ఫుడ్స్ అనే ప్రైవేట్ సంస్థకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్రాంచైజ్ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ,కొన్ని పాల ఉత్పత్తుల ప్యాకెట్లపై వివరాలు స్కాన్ చేస్తే ప్రైవేట్ కంపెనీల వివరాలు కనిపిస్తున్నాయని తెలిపారు.దీంతో వినియోగదారుల్లో అయోమయం నెలకొం టోందన్నారు.ప్రజలు నిజమైన తెలంగాణ



విజయ పాలు,పాల ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.ప్రస్తుతం బ్రాండ్ విభజన పూర్తికాలేదని, నాణ్యత పరంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.హైదరాబాద్ నగరంలో ప్రతినెల సుమారుయి 100 టన్నుల నెయ్యి విక్రయిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో విజయ డెయిరీ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## మహిళా దినోత్సవ వేడుకలు




**హయత్ నగర్, మార్చి 07 (జనంసాక్షి):** హయత్‌నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ అపర్ణా చతుర్వేది ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ బాబు అధ్యక్షత న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు, బాలురకు పాటలు, నృత్యాలు, చిత్రలేఖనం మొదలైన పోటీలను నిర్వహించి, ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, ప్రొఫెసర్ నాగేంద్ర, అధ్యాపకులు డాక్టర్ గీతానాయక్, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి, రజిత, ఉమారాణి, మమత, శిరీష, సుభాషిణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### స్త్రీలు గౌరవింపబడే

## సమాజం వృద్ధి చెందుతుంది

### లయన్ డాక్టర్ మండా సురేష్



**కుషాయిగూడ ,(జనంసాక్షి):** స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో అట్టి సమాజం అత్యంత వృద్ధిలోకి వస్తుందని లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 సి సెకండ్ వాయిస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మండా సురేష్ పేర్కొన్నారు. ఉమెన్స్ డే ను పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ లో గల సెయింట్ థెరీసా పాఠశాలలో ప్రిన్సిపల్ సిస్టర్ సుధా వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ లీలీ పాపి లతోపాటు పలు ప్రాంతాల్లో మహిళలను భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయ చారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడు రాజకీ యంగా సామాజికంగా ఎదగగలుగుతారని పేర్కొన్నారు. లైఫ్ క్లబ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయాచారి మాట్లాడు తూ మహిళల రాజకీయ ఎదుగదల మూలంగా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. మహిళల్లో ఉన్న పట్టుదలను ప్రతిభను గుర్తించి వారిని బాల్య దశ నుంచే విద్యా పరంగా ఆయా రంగాలలో ఎదిగే విధంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ లయన్ మహంకాళి నరసింహ చారి లయన్ అనంతలక్ష్మి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## కేసారంలో ఐదు గ్రామాలకు వాటర్‌షెడ్ ప్రణాళిక

### నాబార్డ్ అధికారుల పరిశీలన, గ్రామసభ ఆమోదం పాల్గొన్న అధికారులు




**మోమిన్‌పేట మార్చి 7(జనంసాక్షి):** రీడ్ సంస్థ ఆధ్వర్యంలో కేసారం, పల్లెగుట్ట తండా, సయ్యద్ అలీ పూర్ , ఎంకేపల్లి వీర్లపల్లి గ్రామాలను కలిపి వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ మంజూరు కోసం రూపొందించిన ప్రణాళికను నాబార్డ్ అధికారులకు పంపించారు. ఈ ప్రణాళికను పరిశీలించడానికి నాబార్డ్ వికారాబాద్ జిల్లా డీడీఎం హర్ష రఘురామ్ , నాబార్డ్ సీనియర్ కన్సల్టెంట్ అర్చన శనివారం కేసారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కిష్టయ్య ఆధ్వర్యంలో, వాటర్‌షెడ్ చైర్మన్ లాయక్ అలీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో రీడ్ సంస్థ సీఈఓ నవీన్ కుమార్ ప్రణాళిక వివరాలను గ్రామస్తులకు చదివి వినిపించారు.ఈ ప్రణాళికలో భాగంగా భూగర్భ జలాల పెంపుదల, భూసంరక్షణ, వ్యవసాయ ఉత్పత్తి పెంపుదల, పచ్చదనం అభివృద్ధి, గ్రామస్తుల జీవనోపాధులను మెరుగుపరిచే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రణాళిక వివరాలను విన్న గ్రామ రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేసి గ్రామసభ ద్వారా ఈ ప్రణాళికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు, వార్డు మెంబర్లు, రీడ్ సంస్థ సిబ్బంది, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆర్టీసీలో వైభవంగా

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**తాండూరు (జనంసాక్షి):** తాండూరు ఆర్టీసీ డిపోలో శనివారం మహిళా దినోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. డిపో మేనేజర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికిదముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ పట్లోళ్ల నీరజబాల్ రెడ్డి , కమిషనర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సందర్భంగా మహిళా కండక్టర్లు సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో మహిళా కండక్టర్లు , డిపో సిబ్బంది పాల్గొన్నారు.